# 24. ఏకప్రేయసీవ్రతుడు

చచ్చిపోయే ధైర్యం లేదు కూర్మాచారికి. కాని ఈ జీవితం వీలైనంత తొందరగా ముగింపుకి వస్తే బావుణ్ణనే కోరిక ఈ మధ్య అతన్ని పట్టిపీడిస్తోంది. ఆదివారాలు కూడా పనిచేయించుకునే ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం ధర్మమాని ఆ రోజులెలాగో గబగబ దొర్లిపోయేవి. ఇల్లూ, పిల్లలూ అనే పూచీ పెళ్ళాం రుక్మిణమ్మ చూసుకొనేది గనక, ఎలా చూసుకొనేదో తెలుసుకొనే తీరిక కూడా ఉండేది కాదు గనక, రిటైర్ అయేదాకా అతని మనసుని ఇవేవీ పీడించేవి కావు.

అవసరాలకి సరిపడే డబ్బులు ఉండేవి ఎప్పుడూ. పిల్లలూ తల్లి చెప్పినట్టు విన్నవాళ్ళే. అదృష్టవశాత్తూ చదువులూ, పెళ్ళిళ్ళూ, ఉద్యోగాలూ ఎక్కడికక్కడ లోటులేక అమరిపోయి తలో చోటూ కూటికీ గుడ్డకీ మొహం వాచిపోకుండా కాలక్షేపం చేస్తున్నారు.

ఏదో యాంత్రికంగా పక్క మీద ఒక్కటయేవారు గాని ఆ ఇద్దరి దిక్కులూ వేరు వేరు. ఉద్యోగ విమరణ తర్వాత ఎక్కువగా ఇంట్లోనే గడపవలసి వచ్చేది కూర్మాచారికి. గుళ్ళూ గోపురాలూ చూసి రావాలనే కోరిక చిన్నప్పుడే అతనికి చచ్చింది. గుడి ఆవరణలోనే వాళ్ళిల్లుండేది, తండ్రికి అర్చకత్వం కనుక. రుక్మిణమ్మకి మాత్రం దేశమంతా చుట్టివచ్చి అన్ని పుణ్యతీర్థాలు దర్శించుకోవాలనే బలీయమైన కోరిక ఉండేది.

అన్ని బాధ్యతలూ తీరాయనుకునేసరికి ఆమెకి మోకాళ్ళ నొప్పులూ, హైబీపీ పట్టుకున్నాయి. ఎంతసేపూ మట్టిమూకుట్లో బొగ్గులు రాజేసి మంచం కింద పెట్టుకొని మూలగడంతో ఆమె జన్మ సరిపోయేది. మొగుడికింత వండివార్చడానికే ఆమె నవనాడులూ క్రుంగిపోయేవి. జరగని ఆచారం, ఇక కుదరదనుకున్న రోగం, గడపదాటలేని దైన్యం ఆమెని పిచ్చిదాన్ని చేసి ఎదురుగుండా దుక్కలా కనపడుతున్న మొగుణ్ణే ప్రతిదానికీ తప్పుపట్టేలా, నోటికే మాటొస్తే అదే అనేసేలా చేశాయి.

కూర్మాచారి అయిదారేళ్ళపాటు ఇంటిపట్టున ఉండి పెళ్ళానికి సాయం చెయ్యడంలో ఎంతో సహనం చూపించాడు. అయినా ఇలా ఎన్నేళ్ళు? తను చేసుకోలేదు. మొగుడు చేసిన ఏ పనీ నచ్చదు. ప్రతిదానికీ పెద్ద గొంతుక పెట్టి నిరసన ప్రదర్శన. ఎన్ని రకాల వైద్యాలో చేయించాడు. పెద్ద పెద్ద జీతాలిచ్చి పనిమనిషినీ, వంట మనిషినీ ఏర్పాటు చేశాడు. ఎక్కడెక్కడి భక్తి కేసెట్లూ, ఇల్లు నింపేడు. మాంఛి టీవీ అమర్చాడు. 'అలా పక్క మీద పడుకొని మనసు మళ్లించుకోవే' అంటే ఆవిడ వినదు.

'చెప్పి చేయించుకోవే' అంటే అర్థం చేసుకోదు. పిచ్చి ఆచారం. తగని చాదస్తం. వల్లమాలిన సెల్ఫ్‌పిటీ. ఏ రోజుకారోజు తనకి కావలసినవన్నీ తు.చ. తప్పక జరిపించుకుంటూ కూడా 'నన్నెందుకు తీసుకుపోవు దేవుడోయ్!' అని రోజుకో వందసార్లయినా పదిమందికి వినపడేలా ఆ పక్క మీంచే గోలపెట్టడం రుక్మిణమ్మగారికీ మధ్య నిత్యకృత్యమైంది.

ఆమెకి కావలసినట్టు అన్నీ అమర్చి పెట్టవలసిందే గాని, అతనికి కూడా కొన్ని యిష్టాలూ అయిష్టాలూ ఉండవచ్చునని గ్రహించే శక్తి రుక్మిణమ్మ ఇటీవల పూర్తిగా కోల్పోయినట్టయింది. మంచానపడ్డ వ్యక్తే గొంతుక చించుకుంటూంటే ఏళ్ళ తరబడి అవన్నీ భరిస్తున్న వాళ్ళు ఎంతకని, ఎన్నాళ్ళని సరిపెట్టుకోగలరు?

క్రమంగా కూర్మాచారికి చిరాకూ విసుగూ ఎక్కువైపోజొచ్చింది. మైలగుడ్డలతో అన్నం వార్చేడని నాలుగు కొంపలకి వినపడేలా ఆవిడోసారి తనమీద అరుస్తూ ఉంటే అతను ఆవేశం ఆపుకోలేకపోయాడు.

ఆ ఉద్రేకంలో ఆ మంచాన్ని ఆమె కిందపడి పోయేలా కుదిపేశాడు. మరో ఇంత గోల చేసేసింది గాని, అతను భయపడినంత ప్రమాదమేమీ ఆమెకి జరగలేదు. మంచం కింద కుంపటి ఆ వేళకి ఆరిపోయి ఉండడం మరో అదృష్టం. రెట్టింపైన ఉత్సాహాన్ని పుంజుకొని మరుక్షణంలో రుక్మిణమ్మ ఊరూవాడా ముక్కుమీద వేలేసుకొనేలా శోకాలూ దూషణలూ మిళాయించింది.

అవేవీ వినపడనంత దూరంగా ఆ వీధి చివరి అరుగు మీద తలపట్టుకు కూచున్నాడు కూర్మాచారి. ఈ వయసులో కూడా మూడుపూటలా తిని ఎంత దూరమైనా నడిచి వెళ్ళగల ఆరోగ్యం ఉండడం తన తప్పుకాదు. తనకీ, పిల్లలకీ ఏళ్ళ తరబడి సేవచేసిన తన పెళ్ళాం ఈ వయస్సులో ఏళ్ళతరబడి ఇంతటి అనారోగ్యానికి గురి కావడం రుక్మిణమ్మ తప్పు కాదు. ఎవరికైనా సరే బతికే ఏళ్ళు ఇంకెన్నో మిగిలి లేవు. కాని ఎందుకిలా ఇంత దుర్భరంగా రోజులు గడుస్తున్నాయి? అదెక్కడికో తెలియదు గాని ఎక్కడికైనా పారిపోవాలని అనిపించింది.

అసలతనికి తన వేదనలెవరికీ చెప్పుకోవాలని ఉండదు. అంతగా ఇంకొకర్నుంచి వినాలనీ ఉండదు. ప్రాణస్నేహితుల మాట దేవుడెరుగు మామూలు ఫ్రెండ్సే లేరు. అటువంటిది ఇవాళ ఎవరో ఒకరితో తన మనసులోని బాధ చెప్పుకోవాలి. లేకపోతే గుండె ఆగిపోతుందేమో అనిపించింది.

ఆ పిచ్చిలోనే ఆ ముందు రాత్రి కూచుని పిల్లలు నలుగురికీ పేరుపేరు వరసనా ఉత్తరాలు రాసేశాడు. ఇంచుమించు వాటిలో మేటరు ఒకటే. 'ఇక్కడ మీ అమ్మ నన్ను తినేస్తోందని మీకు స్పష్టంగా తెలుసు. పిచ్చెత్తిపోతానో, ఎక్కడికైనా పారిపోతానో ఎందులోనైనా పడతానో, ఏదో ఓ కబురు మీరు తొందర్లోనే తెలుస్తుంది. రక్త సంబంధీకులయినా మీదైన కుటుంబ బాధ్యత స్వీకరించక అన్నీ తెలిసి ఏమీ పట్టనట్లు స్వార్థంతో తప్పించుకున్నారు గనక మిమ్మల్నీ విషాదం పశ్చాత్తాపంతో క్రుంగదియ్యక తప్పదు' ఇలా సాగింది.

అటువైపు తిరిగి ఔషధ సేవనంలోని మత్తులో జోగుతున్న పెళ్ళాం పక్క చూస్తే పక్కనున్న పెద్ద సైజు మందుసీసా అందుకొని దాంతో ఆ బుర్రని భళ్ళున బద్దలు కొడదామన్నంత ఉద్రేకం వచ్చింది.

పోవాలి, ఈ పరిస్థితుల్నుంచి వీలైనంత తొందరగా పారిపోవాలి అనే గింగురుమంటున్న

ఆలోచనలో 'పారిపోవాలి' అని మాట దగ్గర టక్కున అతను ఆగిపోయాడు. జీవితం అంటే ఏమిటి? అది చైతన్యానికి సటీక. చలనానికి ప్రతీక. అది తూలిజారిపోవడానికి కాదు. బేజారై ఆరిపోవడానికి కాదు ఆగిపోకుండా అనుకున్న చోటికి సాగిపోతూ ఉండాలి. ఉన్నచోటే ఉండిపోయే పాడిఅంకె కాకూడదు జీవితం. ప్రయత్నంతో కుడివైపుకి జరుగుతూ ఉంటేనే దాని విలువ పెరిగేది.

ఉద్యోగంలో ఆహుతి అయిపోయి బూడిద కుప్పగా మిగిలిపోవడానికేనా జీవితం? అంతకు ముందూ ఆ వెనకా అంతర్జ్వాల అంటూ ఉండదా ఏం?

'అంతకుముందు' అనే చోట టక్కున ఆగి నెమరు వేసుకోజొచ్చాడు కూర్మాచారి. ఆ అంతర్జ్వాల ఆధారంగా ఒలింపిక్ జ్యోతిని చేతపట్టుకొని పరిగెత్తుతున్న ధోరణిలో తనూ పాతికేళ్ళ ప్రాయాన ఇంటినుంచి పారిపోకపోలేదు. ఇప్పుడైతే తనకెవరూ అడ్డుకోవడానికి లేరు గాని ఆ వేళకి తనకో పెళ్ళాం, ఇద్దరు పిల్లలూ, తల్లిదండ్రీ. అయినా పారిపోదలిచాడు. ఇంతకీ ఏ గమ్యం వైపుట ఆ పయనం?

తనెప్పుడూ మరచిపోలేదు. దీక్ష అనే సినిమాలో 'పోరా బాబూ పో, పోయి చూడు ఈ లోకం పోకడ' అనే పాట వచ్చింది. ఆ పాట పల్లవి తనకి చాలా ఇష్టం. ఇష్టమే కాదు ప్రాణం కూడా. మొగుడు పోయిన తర్వాత ఆయన ఇచ్చిన ఆస్తితో తమ ఇల్లు చేరిన పెద్దమ్మకి తనని పెంపకానికి ఇచ్చారు. ఇంట్లోనే ఉన్న అమ్మ తనని పాలతో పెంచిందో లేదో గాని పెద్దమ్మ తనని పాటతోనే పెంచింది.

తన నెలల వయసప్పుడు తనకెలాగా మాటలు రావు. పెంపకం తల్లికి పాటలు తప్ప మరొకటి రావు.

ఆ రోజుల్లో ఆమె ఎక్కడ నేర్చుకుందో గాని ఎన్నెన్ని తియ్యని తెలుగు పాటలు వినిపించేదో. దైవపూజ నిర్వహించే వృత్తి తన పెద్దలది కాబట్టి కాస్త ఎదుగుతున్న కొద్దీ తన చెవిన ఇంటికొచ్చిన పిల్లలకి తర్ఫీదు ఇచ్చే తన తండ్రి వేదమంత్రాలు చెవిన పడేవి. ఆ రోజుల్లో అలాంటి చదువులు ఆడాళ్ళకి నిషిద్ధం కనక పెద్దమ్మని ఆ చుట్టుపక్కలకి రానిచ్చేవారు కారు.

అయితే తనకి అక్కడ చెప్పుకున్న ఋగ్వేద మంత్రం కన్నా ఏ జన్మలో నేర్చుకుందో ఏమిటో పెద్దమ్మ నోటి నుంచి వచ్చే సామవేద సంగీతమే నరనరానా ప్రవహించేది. అది ఆవుపాల లాంటి పరాయిభాషా, ఇది అమ్మ పాలలాంటి మాతృభాషా.

ముసలావిడ ఆవిడ దారిన ఆవిడ పోతే పోయింది గాని గుండెనిండా గోదారి నింపి మరీ పోయింది.

కళా హృదయం అంటారు గాని కళామేధస్సు అనరు గదా! ఏ కళావాహినికైనా జన్మస్థలి హృదయం మాత్రమే. అయితే ఎద పరవశించినంత మాత్రాన గానలహరి తనంత తాను పొంగి పొర్లాడదు. గొంతెత్తి పాడగల కమ్మని కంఠం ఉండాలి. పెద్దమ్మ పాడే మధురమైన పాటలు విని

తరించడమే గాని పలవరించి ప్రతిధ్వనించగల గాత్ర మాధుర్యం కూర్మాచారికి లేదు. అయితే చిన్నప్పట్నుంచి చెవికెక్కి కూచున్న తెలుగు నుడికారపు వెలుగు వెన్నెలలు అతన్ని నిలవనియ్యలేదు.

'పాడలేకపోతే పోయె, రాయలేనా నేను?' అనే మరో మంచిమార్గంలో అతను స్వర్గం నిర్మించుకున్నాడు. దాంతోపాటు ఇంట్లో చదివించిన సుమతి, వేమన శతకాలూ, భాగవతంలోని పద్యాలూ, ఆనాటి తెలుగు సినిమా పాటల్లోని మాటలూ అతనిలోని రచనాసక్తిని సుగమం చేశాయి. పాటంతా గుర్తులేదు గాని, ఆ వయస్సులో తను రాసిన ఓ పల్లవి జీవితాంతం మరచిపోలేడు.

**బిగించుకుంటే సంకెలలు**

**తమంత దిగునా వెన్నెలలు?**

ఆచరణలో పెట్టలేని ఇలాంటి చరణాలు ఎన్ని గుర్తు పెట్టుకుంటే ఏం లాభం! పారిపోవడమనేది ఇంటి నుంచి కాదనీ, తననుంచే అనీ, వేసుకున్న బంధనాల నుంచి అనీ తెలీక ఎలా వెళ్ళినవాడు అలాగే తిరిగొచ్చేశాడు. గాడిలో పడిపోయి కొట్టుకుపోయాడిన్నాళ్ళూ. రుక్మిణమ్మ ఇంట్లో కలగజేసే పరిస్థితుల ధర్మమా అని ఇన్నాళ్ళకి తనకింకా బతుకు మిగిలే ఉందనీ వెతికితే వెలుగూ వేడీ దొరక్కపోవనీ ఇప్పుడిప్పుడే అనిపిస్తోంది.

ఇంటికి బాగా దూరంగా వెళ్ళి కూచుంటే ఆనాడు పెద్దమ్మ గుండెల్లో గుచ్చెత్తిన తెలుగు పాటల గులాబీ గుత్తి మళ్ళీ మళ్ళీ మనసు నెమరు వేసుకోగలుగుతుంది. తనకెన్నిసార్లు చెప్పినా సరిగా గుర్తురాకపోతే "మోహన రాగం ఫలానా అని ఎలా చెప్పన్రా కన్నా! పోనీ 'కృష్ణా ముకుందా మురారీ!' వరస గుర్తుంటుందా, ఆ రాగమేను రా ఇది!" అని చెప్పడం సహా గుర్తొస్తోంది.

"ఎవరా అరుగు మీద కూర్చున్నది? చినుకులు పెద్దవయ్యాయని కూడా తెలీలేదా, లోపలికి రండి!"

ఓ తియ్యని స్వరం ఆప్యాయంగా పలకరించగా అప్రయత్నంగా లేచి నిలబడి అప్పుడే గుర్తించాడు కూర్మాచారి, తన బట్టలు పూర్తిగా తడిసిపోయాయని.

"అయ్యో ఇంకా అక్కడే తడుస్తూ నిలబడిపోతారేం? తలుపు తీసే ఉంది. లోపలికి రండి. దండెం మీద తువ్వాలుంది. ముందు తల తుడుచుకోండి."

లోపలికి వెళ్ళి ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయాడు. ఆ పిల్చిందెవరో పక్క గదిలోంచే. ఆమె అభ్యర్థన మన్నించేలా చెయ్యడమే కాక, వేడివేడి కాఫీ స్వయంగా అందించింది కూడా. అప్పుడు తలెత్తి చూశాడు. ఏభై, ఏభై అయిదేళ్ళ ఓ స్త్రీ. ఎందుకో తొట్రుపడి లేచి నిలుచున్నాడు. చేతిలోని కాఫీ గ్లాసు అక్కడ ఉంచేశాడు.

"చెప్పకపోయినా చలికి గజగజ వణుకుతున్నారు తడి బట్టలతో. పొడిబట్టలిద్దామంటే ఇంట్లో మగాళ్ళ బట్టలేం లేవు. కాఫీ అయినా తాగేసి వెళ్ళండి."

ఆ జాలిని గాలికొదిలెయ్యలేక అలాగే చేశాడు. కృతజ్ఞతగా చూసి అక్కణ్ణుంచి

కదలిపోయాడు.

వానదేవుడు కరుణించినట్లయి అలా వాళ్ళ తొలి పరిచయమైంది గాని తర్వాత వాళ్ళిద్దరూ వాళ్ళిద్దర్నే గాని మరెవర్నీ తలుచుకోనంతగా సన్నిహితులయ్యారు.

ఆవిడ పేరు రత్నావతి. ఎప్పుడో పెళ్ళయి పిల్లల్ని కంది గాని భర్తకి అనుమాన రోగం. ఆ పిల్లలు తనకి పుట్టలేదని భార్యని హింసించిన పరమ దుర్మార్గుడు.

వాళ్ళ అదృష్టం బాగుండి అట్టే కష్టాలు పడకుండా పిల్లలంతా చిన్నతనంలోనే కన్ను మూశారట. ఆ సమయంలో ఓ మేనమామ అడ్డుపడ్డానికి ప్రయత్నిస్తే అతనితోనే సంబంధం అంటగట్టి వెళ్ళగొట్టేడట.

ఆ మేనమామ బాగా ఆస్తి ఉన్నవాడు. దిక్కులేనిదని ఇప్పుడున్న ఈ ఇల్లు తన పేర రాయబట్టి ఎలాగో బతుకుతోంది. అప్పడాల కంపెనీలో పనిచేస్తూ ఇంత తెచ్చుకుంటూ. ఇప్పుడటు మొగుడూ లేడు, తననిలా నిలబెట్టిన మేమమామా లేడు. మేనత్త ముందే పోయిందిట. వాళ్ళకొక్కర్తే కూతురు. పెద్ద భవనంలో ఉందిట.

తనకి మాత్రం ఎవరున్నారు. పిల్లలంతా కళ్ళముందే పోయారుగా. ఓ సారి వెళ్ళి చిట్టిని చూసిరావాలని మనసెంతో పీకుతున్నా నలుగుర్లో ఏం ఆడిపోసుకుంటుందో అని భయంట.

ముక్కూ మొహం ఎరగని ఓ ఆడమనిషి మనసు విప్పి కష్టం సుఖం చెప్పుకుంటూంటే వింటూ కూచోలేకపోయాడు కూర్మాచారి. ఎంతటి నల్లరాయికైనా అట్టడుగున చలచల్లని ఊటలుండొచ్చు అనిపించడం అతన్ని ఎంతగానో అబ్బురపరిచింది.

అంతే. తనవనుకున్నవన్నీ రత్నావతి ముందు పరచందే అతను నిలవలేకపోయాడు.

ఎంతటి ఎండుతొర్రనైనా అందులోని ఎర్రమూతి పచ్చని చిలక బతికే ఆశ రగిలించ గలదని వాళ్ళు పోల్చుకున్నారు. శూన్యమైన బతుకుల్లో సొంపులనేవి నింపుకున్నారు.

ఇప్పుడు కూర్మాచారికి పారిపోవాలని లేదు. గొంతెత్తి మనసారా పాడుకోవాలనే ఉంది! రత్నావతి నుంచి ఎలాగా కాదు, రుక్మిణమ్మ నుంచి కూడా.

పైగా పోయిందేదో దొరికినట్లయితే ప్రేమతో పొంగి పొరలడంతో అతనికి మంచంలో ఉన్న భార్యపట్ల సానుభూతి మరింత పెరిగింది. పిల్లలకి శాపనార్థాలు పెడుతూ ఉత్తరాలు రాయ ప్రయత్నించినందుకు సిగ్గుపడి వాటిని ముక్కముక్కలుగా చింపేశాడు.

అటు రత్నావతీ అంతే. ఆమె బతుకు మళ్ళీ చివురు తొడిగింది. నివురు నిలిచింది. ఎలాంటిదైతేనేం, మేనమామ కూతురు చిట్టీ ఓ మనిషే. దాన్ని వెంటనే వెళ్ళి చూడాలని నిశ్చయించుకుంది. ఆ చిట్టి ఈ మధ్య మరో పాట్టిని పెట్టిందిట, నిలుచున్న పళాన వెళ్ళి దాని బుగ్గలు కొరికి రావాలని కృతనిశ్చయురాలైంది.

★